నియామకం



ముక్తార్‌పాషాతో కార్తీక్‌రెడ్డి, నాయకులు

మణికొండ: రాజేంద్రనగర్ నియోజకవర్గం బీఆర్ఎస్ మైనార్టీ కార్యదర్శిగా నార్సింగికి చెందిన షేక్ ముక్తార్ పాషాను నియమించారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పి. కార్తీక్‌రెడ్డి చేతుల మీదుగా మంగళవారం ఆయన నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మైనార్టీలకు ఎన్నో సంక్షేమ పథకాలను అందించిందన్నారు. వారు పార్టీకి వెన్నుదన్నుగా ఉన్నారని, నియోజకవర్గవ్యాప్తంగా ఎదురయ్యే సమస్యలపై నిత్యం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నార్సింగి మున్సిపాలిటీ బీఆర్ఎస్ అధ్యక్షుడు కె. విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు షేక్ అజీజ్, జమాల్, షేక్ సయ్యద్, ఎండీ కలీం, ఎండీ ఫారుఖ్, షేక్ ఇమ్రాన్, ఫరీదాబేగం, ఆశబగం, శ్రీకాంత్‌రెడ్డి, అక్బర్, సంతోష్, ప్రియదర్శిని, జయమ్మ, గణేష్ ముదిరాజ్, గణేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎంజీఐటీ విద్యార్థుల సత్తా



మణికొండ: అనురాగ్ యూనివర్సిటీలో సోమవారం నిర్వహించిన ఐడియాతాన్ కాంపిటీషన్‌లో ఎంజీఐటీ సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులు సత్తాచాటారు. మొత్తం 155 టీంలు పాల్గొనగా మొదటి స్థానంలో నిలిచి రూ.20 వేల నగదు బహుమతితో పాటు ప్రశంసాపత్రాలు అందుకున్నారు. బహుమతులు పొందిన రాహుల్‌యాదవ్, ఉమేశ్‌చంద్ర, బురానుద్దీన్‌ను ప్రిన్సిపాల్ డాక్టర్ జి.చంద్రమోహన్‌రెడ్డి, హెచ్ఓడీ డాక్టర్ వి.వెంకట్‌రామయ్య మంగళవారం అభినందించారు.

ఆయుర్వేదంపై అవగాహన సదస్సు



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

మైలార్‌దేవ్‌పల్లి: జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకుని మహవీర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం యూనిట్ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా ప్రముఖ ఆయుర్వేద డాక్టర్ పి.నిత్యానందకుమార్‌రెడ్డి హాజరై మాట్లాడారు. పురాతన ఆయుర్వేద మందులతో అనేక రోగాలు నయం చేస్తున్నామన్నారు. కళాశాల సెక్రటరీ సంరెడ్డి సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో ప్రపంచానికి ఆయుర్వేదం గురించి తెలుస్తుందన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ వీరేంద్రపాటిల్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.ఉషశ్రీ, జాయింట్ సెక్రటరీ ఎస్.ధనుంజయ్‌రెడ్డి, డాక్టర్ మధుసూదన్, హెచ్ఓడీలు తదితరులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం



పద్మమ్మ

మణికొండ: మహిళ అదృశ్యమైన ఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కాళీ మందిర్ వద్ద జరిగింది. నార్సింగి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా దోమ మండలం, గుమ్మడల్ గ్రామానికి చెందిన దోమ పద్మమ్మ (35) శంషాబాద్‌లోని తన కూతురు ఇంటికి వెళ్లేందుకు స్వగ్రామం నుంచి బయలుదేరి కాళీ మందిర్ వద్ద బస్ దిగింది. అయితే ఆమెను తీసుకువెళ్లేందుకు అల్లుడు రాగా ఆమె కనిపించలేదు. ఫోన్ కూడా తీయక పోవడం, తిరిగి వారి ఇంటికి కూడా వెళ్లకపోవడంతో ఆమె భర్త మంగళవారం నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లింకు రోడ్డుకు వెళ్లే దారి కబ్జా

హైడ్రా కమిషనర్‌కు ఫిర్యాదు


శేరిలింగంపల్లి: జీహెచ్ఎంసీ లింకు రోడ్డుకు వెళ్ళే దారిని ఆక్రమించి ప్రహరీ నిర్మించారని.. దీంతో వేలాది కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు పాపిరెడ్డినగర్ అధ్యక్షులు బద్దం కొండల్‌రెడ్డి మంగళవారం ఫిర్యాదు చేశారు. పాపిరెడ్డినగర్ నుంచి జీహెచ్ఎంసీ ఆఫీస్ వరకు ఉన్న లింకు రోడ్డుకు వెళ్లే రోడ్డును కబ్జా చేసి ప్రహరీ నిర్మించారని, దీంతో పాపిరెడ్డినగర్, సందయ్యనగర్, సురభికాలనీ, రాజీవ్ గృహకల్ప, రాజీవ్ స్వగృహలలో నివసించే సుమారు 45 వేల మంది ప్రజలు ఇబ్బందిపడుతున్నారని వివరించారు. పాపిరెడ్డినగర్‌లో పర్యటించి సమస్యను పరిష్కరించాలని హైడ్రా కమిషనర్‌ను కోరారు.



ఓయూ కాలనీ దుర్గామాత..



గాయత్రీదేవి అలంకరణలో కోట మైసమ్మ



ధర్మగిరి ఆలయంలో ..

వైభవంగా దేవీ శరన్నవరాత్రులు



హైదర్షాకోట్ విజయగణపతి ఆలయంలో కుంకుమార్చన..

నియోజకవర్గవ్యాప్తంగా దేవీ శరన్నవరాత్రులు వైభవంగా కొనసాగుతున్నాయి. మంగళవారం అమ్మవారు గాయత్రీమాత రూపంలో దర్శనమివ్వగా భక్తులు ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు, చండీ హోమాలు నిర్వహించారు. అలాగే మండపాల వద్ద మహిళలు పెద్ద ఎత్తున బతుకమ్మ, దాండియా ఉత్సవాల్లో పాల్గొంటున్నారు.

– రాజేంద్రనగర్ జోన్ బృందం



పూజల్లో భక్తులు



నార్సింగిలో పూజలు చేస్తున్న భక్తులు



మంచిరేవుల పూజల్లో భక్తులు



మణికొండలో..



నార్సింగి లక్ష్మమ్మ ఆలయం వద్ద..

అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలని వినతి



మాణిక్యమ్మ కాలనీలో రోడ్డుపై చేపడుతున్న నిర్మాణం

రాజేంద్రనగర్: రోడ్డును ఆక్రమించి చేపడుతున్న నిర్మాణాలను నిలిపేయించాలని కోరుతూ రాజేంద్రనగర్ మాణిక్యమ్మ కాలనీవాసులు ఉప కమిషనర్ సురేందర్ రెడ్డి, టౌన్ ప్లానింగ్ అధికారి శ్రీధర్‌ను మంగళవారం వేర్వేరుగా కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మాణిక్యమ్మ కాలనీ, ఎస్సీ బాయ్స్ హాస్టల్ ప్రాంతం రోడ్డు అసలే ఇరుకుగా ఉందని అక్రమ నిర్మాణాలతో మరింత కుచించుకుపోతుందన్నారు. తాము సెట్ బ్యాక్ చేసి కట్టుకోవాలని కోరినా పట్టించుకోవడం లేదన్నారు. దీంతో జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదు చే సినట్లు తెలిపారు. అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

డీసీఎంలో చెలరేగిన మంటలు



మంటలార్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓల్డ్ టైర్స్ స్క్రాప్‌లోడుతో నిండి ఉన్న డీసీఎం టీఎస్12 యూడీ2365లో అకస్మాత్తుగా మంటలు చేలరేగాయి. గమనించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బంది, పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిపమాపక సిబ్బంది మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకువచ్చారు. తెల్లవారుజామున జరగడంతో భారీగా పొగ వ్యాపించడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు



శంషాబాద్: పట్టణంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మంగళవారం పుణ్యాహవచనం, బాలభోగం, మూర్తి కళశస్థాపనం, గరుడపతాదివాసం, ధ్వజారోహణం, సాముహిక విష్ణుసహస్రనామ పారాయణం, కుంకుమార్చన, నిత్యహోమం అన్నదానాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు గౌత వివేకానందగుప్తా, ప్రధాన కార్యదర్శి చింతల నందకిశోర్ గుప్తా, కోశాధికారి రామకృష్ణ, మధు, రమేశ్, ధర్మ, ఎండవల్లి రామేశ్వర్‌రావు, మాడుగుల పాండు, ప్రకాశ్, శేఖర్, శ్రీనివాస్, ఆకుల రవి తదితరులు పాల్గొన్నారు.

ఓయూలో కాంట్రాక్ట్ ఉద్యోగుల నిరసన

లాలాపేట: ఉస్మానియా యూనివర్సిటీ నాన్ టీచింగ్ కాంట్రాక్ట్ ఉద్యోగులు మంగళవారం ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. మినిమం టైం స్కేల్ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, యూనివర్సిటీ అధికారులకు విజ్ఞప్తి చేశారు. 25 ఏళ్ల నుంచి చాలీచాలనీ వేతనాలతో వెట్టిచాకిరీ చేస్తున్నామన్నారు. శ్రమదోపిడికి గురవుతున్నామన్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వారం రోజుల పాటు వివిధ రూపాల్లో నిరసన చేస్తున్నామన్నారు. నాన్ టీచింగ్ కాంట్రాక్ట్ ఉద్యోగులు సంఘం అధ్యక్షుడు సూర్యచందర్, ప్రధాన కార్యదర్శి చేర్యాల శ్రీనివాస్,రాగిణి, వీరేశం, యారాల రాజేష్, కట్కూరి శ్రీకాంత్, హుస్సేన్ పాషా తదితరులున్నారు.

'జీఎస్టీ తగ్గింపుతో దీపావళి ముందే వచ్చినట్లైంది'

చార్మినార్: జీఎస్టీ బచావ్ ఉత్సవ్ ప్రచారంలో భాగంగా దేశ ప్రధాని నరేంద్ర మోదీ తీసుకున్న నిర్ణయంతో దేశ ప్రజలకు ముందే దీపావళి పండుగ వచ్చినట్లు అయ్యిందని బీజేపీ మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ అన్నారు. మంగళవారం చార్మినార్‌లోని పలు ప్రాంతాల్లో పర్యటించి ప్రధాని నరేంద్ర మోదీ చేపట్టిన పథకాలను వారికి వివరించామన్నారు. ముఖ్యంగా జీఎస్టీ తగ్గింపుతో దాదాపు 295 వస్తువులు చౌకగా మారాయన్నారు.

జర్నలిజంలో సవాళ్లను ఎదుర్కోవాలి

'మనూ' వీసీ ప్రొ. ఐనుల్ హసన్

రాయదుర్గం: జర్నలిజం వృత్తిలో కొత్త సవాళ్లను ఎదుర్కోవడానికి ఉర్దూ జర్నలిస్టులు సిద్ధంగా ఉండాలని మనూ వీసీ ప్రొ.ఐనుల్ హసన్ అన్నారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో కేంద్ర విద్యాశాఖ, ఉర్దూ భాష ప్రమోషన్ నేషనల్ కౌన్సిల్ (ఎన్‌సీపీయూఎల్), మనూలోని మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం విభాగం సంయుక్తంగా నిర్వహించిన 'ఉర్దూ జర్నలిస్టుల సామర్థ్య నిర్మాణం' అనే అంశంపై మూడురోజుల జాతీయ వర్క్‌షాప్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. జర్నలిస్టులు, విద్యార్థులు తమ భాషా నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలన్నారు. భారత న్యూస్ నెట్‌వర్క్ సీఈఓ, ఎడిటర్ ఇన్ చీఫ్ డాక్టర్ సర్ఫరాజ్ సైఫీ మాట్లడుతూ ఉర్దూ జర్నలిజంలో ముఖ్యంగా ప్రసార రంగంలో అవకాశాలు, అడ్డంకులను ఆయన వివరించారు. అనంతరం యూనివర్సిటీ మ్యాగజైన్ 'అల్-కలామ్'ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మ్యాగజైన్ ఎడిటర్ పీఆర్ఓ డాక్టర్ మహ్మద్ ముస్తఫా అలీ సర్వారీ, ఫ్యాకల్టీ, అధికారులు, ఉర్దూ జర్నలిస్టులు పాల్గొన్నారు.

విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి

గోల్కొండ: విద్యార్థులను ఉత్తమ భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాలని గోల్కొండ మండల డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ మహ్మద్ బషీరుద్దీన్ అన్నారు. మంగళవారం గోల్కొండ ప్రభుత్వ ఉర్దూ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో గోల్కొండ మండలానికి చెందిన ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గోల్కొండ మండలానికి చెందిన మొత్తం 28 మందిని ప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేసిందన్నారు. వీరిలో ఏడుగురు ఉపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లు ఉన్నారని మిగతా 21 మంది ఎస్‌జీటీ ఉపాధ్యాయులు అని ఆయన అన్నారు. విద్యా ప్రమాణాలు పెంపొందించడానికి తగిన సలహాలు, సూచనలు ఉపాధ్యాయులతో పాటు ప్రధానోపాధ్యాయులు కూడా ఇస్తుండాలన్నారు.

పరిసరాల శుభ్రతతోనే వ్యాధుల నివారణ



మాట్లాడుతున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: ఇంటితో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకున్నప్పుడే వ్యాధుల నివారణ సాధ్యమవుతుందని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర పేర్కొన్నారు. 'స్వచ్ఛతహీ సేవా-2025' లో భాగంగా కార్పొరేషన్ కార్యాలయం నుంచి వివేకానంద విగ్రహం వరకు మంగళవారం స్వచ్ఛత ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు స్వచ్ఛతపై ఎప్పటికప్పుడు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఈ జి.యాదయ్య, ఏఈఈ వి.రాజ్ కుమార్, మేనేజర్ టి.పర్వతాలు, ఆర్వో కె.శివకుమార్, జేఏవో ఎం.స్వాతి, జి.వెంకట్‌రెడ్డి, వివిధ సెక్షన్ల అధికారులు, సెక్షన్ అసిస్టెంట్లు, వార్డు అధికారులు, డీఈఓలు, డబ్ల్యూయూఏలు, బీసీలు, ఆర్‌పీలు, ఎస్‌హెచ్‌జీ సభ్యులు, ఎలక్ట్రీషియన్లు, శానిటరీ జవాన్లు, కామాటీలు, స్వీపర్లు తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రిని కలిసిన నేతలు



శంషాబాద్: మాజీ మంత్రి, ఎమ్మెల్సీ పి. మహేందర్‌రెడ్డిని శంషాబాద్ పట్టణానికి చెందిన పలువురు కాంగ్రెస్ నేతలు మంగళవారం ఆయన నివాసంలో కలిసి శాలువాతో సత్కరించి స్వీట్లు తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పీసీసీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు జల్లపల్లి నరేందర్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శేఖర్‌యాదవ్, యువజన నాయకుడు గుంటి ప్రవీణ్‌కుమార్, నజీరుద్దీన్, పాల్సన్ తదితరులు ఉన్నారు.

'కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా మైనార్టీలు'

చార్మినార్: కాంగ్రెస్ ప్రభుత్వం మైనార్టీల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించడంతో ముస్లిం మైనార్టీలు ఆ పార్టీకి వ్యతిరేకంగా ఉన్నారని బీఆర్ఎస్ చార్మినార్ శాసనసభ నియోజకవర్గం ఇన్‌చార్జి మహమ్మద్ సలావుద్దీన్ లోది అన్నారు. మంగళవారం ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్‌తో జరిగిన సమావేశంలో తాను పాల్గొని ముస్లిం మైనార్టీల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే విషయాన్ని ఆయన దృష్టికి తీసుకువచ్చానన్నారు. రాబోయే జూబ్లీహిల్స్ ఎన్నికల్లో ఈ అంశాన్ని పెద్ద ఎత్తున తెరపైకి తీసుకువస్తే ఆశించిన ఫలితాలు ఉంటాయన్నారు.

దసరా పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి



కార్మికులకు దుస్తులు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

మణికొండ: దసరా పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ అన్నారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలో పనిచేస్తున్న 400 మంది కార్మికులకు మాజీ చైర్మన్ కె.నరేందర్‌ముదిరాజ్, ఆయన సోదరులు వారి తల్లిదండ్రులు కస్తూరి సత్తయ్య, నర్సమ్మల జ్ఞాపకార్థం యేటా మాదిరిగానే చీరలు, దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ టి. మల్లేశ్‌ముదిరాజ్, మున్సిపల్ కమిషనర్ డి. ప్రదీప్‌కుమార్, డీఈలు శివసాయి, సంజయ్, మేనేజర్ శ్రీధర్, పుప్పాలగూడ మాజీ సర్పంచ్ కె. బాల్‌రాజ్ ముదిరాజ్, జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు కె. యాదయ్య, ఆల్ కాలనీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు ఎ.వంశీ, మాజీ కౌన్సిలర్లు, నాయకులు, పలు కాలనీల సంక్షేమ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని హెచ్‌సీయూ విద్యార్థి సంఘం అధ్యక్షుడు శివ పాలెపు స్పష్టం చేశారు. ఆదివారం మాట్లాడుతూ హాస్టళ్లలో నాణ్యమైన ఆహారం అందేలా చేయడమే ప్రధాన లక్ష్యం అని అన్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. ఈ విజయం కేవలం కార్యకర్తలు, విద్యార్థుల సమిష్టి కృషికి నిదర్శనంగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు పాల్గొన్నారు.

ఔటర్‌పై కారును ఢీకొట్టిన లారీ

మణికొండ: ఔటర్ రింగ్ రోడ్డుపై ఓ లారీ వెనుక నుంచి కారును ఢీ కొట్టడంతో కారులోని మహిళలు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శంషాబాద్ నుంచి గచ్చిబౌలి వైపు వస్తున్న (టీఎస్ 08 జెక్యూ 9249) నంబర్ గల కారును వెనుక నుంచి వచ్చిన లారీ (ఏపీ 39 యూఏ 6096) మంచిరేవుల సమీపంలో అర్ధరాత్రి 1.35 గంటలకు ఢీకొట్టింది. దాంతో కారు వెనుకభాగం దెబ్బతినడంతో పాటు కారులోని ఓ మహిళ కాలుకి గాయమైంది. సమాచారం అందుకున్న ఔటర్ ట్రామా కేర్ సెంటర్ వారు క్షతగాత్రురాలుతో పాటు మరో ఇద్దరిని సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. అలాగే పుప్పాలగూడ ఔటర్ టోల్ గేట్ సమీపం సర్వీసు రోడ్డులో ఓ కారులో మంటలు చెలరేగాయి. అయితే ఈ రెండు ఘటనలకు సంబంధించి ఎలాంటి ఫిర్యాదులు రాలేదని నార్సింగి పోలీసులు తెలిపారు.



ధ్వంసమైన కారు వెనుకభాగం



గాయపడ్డవారిని ఆసుపత్రికి తరలిస్తున్న ఔటర్ ట్రామా కేర్ సిబ్బంది

15 రోజుల్లో కొత్త విద్యుత్ స్తంభాలు

రాయదుర్గం: ఖాజాగూడ వీకర్ సెక్షన్‌లో 15 రోజుల్లో కొత్త విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయిస్తామని టీజీ ఎస్పీడీసీఎల్ సైబర్ సిటీ సూపరింటెండెంట్ ఇంజనీర్ చంద్రశేఖర్ స్థానికులకు హామీ ఇచ్చారు. బస్తీబాటలో భాగంగా గచ్చిబౌలి డివిజన్ ఖాజాగూడ వీకర్ సెక్షన్‌బస్తీలో ఆయన విద్యుత్ అధికారులతో కలిసి మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బస్తీలో విద్యుత్ వినియోగం, బిల్లుల చెల్లింపులు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బస్తీబాటలో సమస్యలు తెలుస్తున్నాయని, దశలవారిగా పరిష్కరిస్తామన్నారు. అధికారులు డీఈ యాదగిరి, ఏడీఈ శివ కృష్ణప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.